సాక్షి కాకినాడ

బుధవారం | 6 | మార్చి | 2024



అసువులు తీసిన అతి వేగం

అతి వేగం అతి విలువైన ప్రాణాలను బలిగొంది. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపిన ఆ యువకుడు తాను మృత్యువాత పడడమే కాక, మరొకరిని బలిగొని రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపాడు.

8లో



నిజాయితీకి నిలువుటద్దం చిట్టబ్బాయి

నీతి నిజాయితీకి నిలువుటద్దంలా రాజకీయాలను నడిపిన కుడుపూడి చిట్టబ్బాయి జిల్లా చరిత్రలో నిలిచిపోతారని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు.

డెల్టాలకు 9,170 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 9,170 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,850, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.20 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

బాలలతో భిక్షాటన చేయిస్తే శిక్ష తప్పదు

కాకినాడ సిటీ: బాలలతో భిక్షాటన చేయించే వారికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష వరకూ జరిమానా విధించే అవకాశం ఉందని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి కె.ప్రవీణ హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలు చదువుకునేలా ప్రోత్సహించాలని కోరారు. భిక్షాటనలో ఉన్న వీధి బాలలను గుర్తించే కార్యక్రమం మంగళవారం నగరంలో నిర్వహించారు. ముగ్గురు తల్లులతో భిక్షాటన చేస్తున్న ముగ్గురు పిల్లలను, ఒక బాల కార్మికుడిని గుర్తించామని ఈ సందర్భంగా ప్రవీణ తెలిపారు. వీరిని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచి, యాచక వృత్తిలో ఉన్న తల్లులకు కౌన్సెలింగ్ ఇచ్చామని చెప్పారు. ఇది పునరావృతమైతే బాలల న్యాయ చట్టం సెక్షన్ 76(1) ప్రకారం చర్య తీసుకుంటామని హెచ్చరించారు. వారి నుంచి లిఖితపూర్వకంగా అంగీకార పత్రం తీసుకున్నారు. కమిటీ ఆదేశాల మేరకు పిల్లలను వారి తల్లులకు అప్పగించారు. జిల్లా బాలల పరిరక్షణ కమిటీ అధికారి సీహెచ్ వెంకటరావు మాట్లాడుతూ, ఎక్కడైనా బాలలతో భిక్షాటన చేయిస్తున్నట్లు కనిపిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు జంగా సంతోష్‌కుమారి, సర్వశిక్షా అభియాన్ కో ఆర్డినేటర్ హరికృష్ణ, సహాయ కార్మిక అధికారి సత్యనారాయణ, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమరానికి సిద్ధం

- ముక్తకంఠంతో నినదించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ప్రత్తిపాడులో నియోజకవర్గ స్థాయి సిద్ధం సభ సక్సెస్
- వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు
- కిక్కిరిసిన సభా ప్రాంగణం
- జిల్లాలో రూ.40 వేల కోట్లతో పరిశ్రమలు ఏర్పాటు
- పార్టీ పార్లమెంటరీ ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్ వెల్లడి
- 400 గ్రామాల దత్తతకు హామీ



సభలో ప్రసంగిస్తున్న వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్

ప్రత్తిపాడు రూరల్/ప్రత్తిపాడు/ఏలేశ్వరం: గడచిన ఐదేళ్లుగా ప్రజలకు ఎంతో సంక్షేమం చేకూరుస్తూ.. అభివృద్ధిని అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని.. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి తీసుకు వచ్చేందుకు.. పార్టీ విజయబావుటాను రెపరెపలాడించేందుకు తాము సిద్ధమని వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు ముక్తకంఠంతో నినదించారు. ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు ఆధ్వర్యాన మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి సిద్ధం సభకు అశేషంగా జనం పోటెత్తారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల నుంచి ప్రత్యేక వాహనాల్లో సుమారు 25 వేల మందికి పైగా జనం తరలివచ్చారు. దీంతో సభా ప్రాంగణం జనసంద్రాన్ని తలపించింది. ప్రత్తిపాడు ప్రధాన రహదారిపై సైతం జన ప్రవాహం పరవళ్లు తొక్కింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రారంభం నుంచి ముగిసే వరకూ సభాప్రాంగణం 'జై జగన్' నినాదాలతో ప్రతిధ్వనించింది. సభ విజయవంతం కావడం వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ నింపింది.



సభకు తరలివచ్చిన జనం

రూ.400 కోట్లతో 400 గ్రామాల అభివృద్ధి

సభకు తరలి వచ్చిన ప్రజలనుద్దేశించి వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ, జిల్లాలోని 400 గ్రామాలను దత్తత తీసుకుని, రూ.400 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. రానున్న ఐదేళ్లలో బడా పారిశ్రామికవేత్తలను జిల్లాకు రప్పించి రూ.40 వేల కోట్లతో పరిశ్రమలు ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బేసిక్ స్కిల్స్ లేనందువల్లనే జిల్లాలో నిరుద్యోగ యువత పెరుగుతున్నారని, ఈ నేపథ్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి, వారందరినీ నిపుణులుగా తీర్చిదిద్ది, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. దేశంలో మునుపెన్నడూ చూడని రీతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గొప్ప పరిపాలన అందించారని అన్నారు. రాష్ట్రంలో 4 పోర్టులు, 9 ఫిషింగ్ హార్బర్లు నెలకొల్పారన్నారు. మూడు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారన్నారు. పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన సాగుతోందని చెప్పారు. రాష్ట్రంలో గతంలో పేదల తలసరి ఆదాయం రూ.1.20 కోట్లు ఉండగా తమ ప్రభుత్వ హయాంలో అది రూ.2.20 కోట్లకు పెరిగిందని సునీల్ తెలిపారు.

ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకుని తింటే.. తమ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి, ప్రజల ఇంటికే నేరుగా పథకాలను అందించిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ, రోజు రోజుకూ వైఎస్సార్ సీపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని అన్నారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు గోళ్ల కాంతి సుధాకర్, పర్వత రాజబాబు, జెడ్పీటీసీ సభ్యులు బెహరా రాజరాజేశ్వరి, గొల్ల చిన దివాణం, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు వాసిరెడ్డి జమ్మిలు, వరుపుల సూరిబాబు, జల్లిగంపల ప్రభాకరావు, పర్వత వివేక్, నాలుగు మండలాల పార్టీ కన్వీనర్లు, జేసీఎస్ మండల కన్వీనర్లు, సొసైటీల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురానికి పవన్ టూరిస్టు మాత్రమే..



సమావేశంలో మాట్లాడుతున్న చలమలశెట్టి సునీల్. చిత్రంలో వంగా గీత తదితరులు

పిఠాపురం: జనసేన అధినేత పిఠాపురం నియోజకవర్గానికి ఒక టూరిస్టు మాత్రమేనని, వచ్చి వెళ్లిపోతారే తప్ప ఏమీ చెయ్యలేరని వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ కో ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన గొల్లప్రోలులో 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' పేరిట మంగళవారం నిర్వహించిన పిఠాపురం నియోజకవర్గ స్థాయి బూత్ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జనసేన అధినేత పిఠాపురంలో పోటీకి దిగితే మీరేం చేస్తారని విలేకర్లు అడిగిన ప్రశ్నకు ఆయన ఘాటుగా స్పందించారు. పవన్ కల్యాణ్ పిఠాపురానికి ఒక సెలబ్రిటీగా మాత్రమే రాగలరని, ఆయనకు ఇక్కడ ఏమాత్రం అవకాశం ఇవ్వరని అన్నారు. స్థానిక ఆడపడుచుగా సుపరిచితురాలైన కాకినాడ ఎంపీ వంగా గీతను ఎదుర్కోవడం ఆయనకు ఏమాత్రం సాధ్యం కాదని చెప్పారు. ఎన్నో ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న వంగా గీతను ఇక్కడి ప్రజలు సొంత మనిషిగా చూసుకుంటారని అన్నారు. ఈ ప్రాంతం మీద ఎటువంటి అవగాహనా లేని వ్యక్తి పవన్ కల్యాణ్ అని విమర్శించారు. మామూలుగా ప్రతిపక్షం నుంచి వేరే అభ్యర్థి అయితే వంగా గీత మంచి మెజార్టీతో గెలవడం ఖాయమని, నిజంగా పవన్ కల్యాణ్ ఇక్కడ పోటీ చేస్తే ఆమె మెజార్టీ మూడు రెట్లు పెరుగుతుందని అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా అన్ని గ్రామాలనూ అభివృద్ధి పథంలో నడిపించిన గీతకు స్థానికులు బ్రహ్మరథం పట్టడం ఖాయమని.. పవన్ కల్యాణ్ వచ్చినా చేదు అనుభవం తప్పదని సునీల్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగా గీత తదితరులు పాల్గొన్నారు.

దూసుకు వచ్చిన మృత్యువు



దాసి జేమ్స్‌బాబు (పాత చిత్రం)

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి జంక్షన్‌లో వేగంగా దూసుకువచ్చిన టిప్పర్ ఢీకొని ఐసీఐసీఐ బ్యాంకు ఉద్యోగి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కూళ్ల గ్రామానికి చెందిన దాసి జేమ్స్‌బాబు (27) ప్రస్తుతం రామచంద్రపురం మండలం ఉండూరు గ్రామంలోని అమ్మమ్మ ఇంటి వద్ద భార్య మేరీ గ్రేస్‌తో ఉంటున్నాడు. రాజమహేంద్రవరం టి.నగర్‌లోని ఐసీఐసీఐ బ్యాంకు కమర్షియల్ వెహికల్స్ లోన్స్ విభాగంలో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం బైక్‌పై నామవరం వైపు నుంచి మోరంపూడి జంక్షన్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి వేమగిరి వైపు తిరుగుతూండగా వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన టిప్పర్ అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో కింద పడిపోవడంతో తలకు బలమైన గాయమై, జేమ్స్‌బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. బొమ్మూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఐడెంటిటీ కార్డు ఆధారంగా మృతుడిని గుర్తించి, బ్యాంకుకు సమాచారం అందించారు. దీంతో, బ్యాంకు సిబ్బంది ఈ విషయాన్ని జేమ్స్‌బాబు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వెంటనే అతడి సోదరుడు సురేష్ రాజమహేంద్రవరం చేరుకున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఉమర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాతకు అభయం

- 'మిచాంగ్' బాధిత రైతులకు ప్రభుత్వం అండ
- నేడు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల
- నెలల వ్యవధిలోనే ఆర్థిక సాయం
- జిల్లావ్యాప్తంగా 27,980 మంది రైతులకు మేలు
- వారి ఖాతాల్లో రూ.21.98 కోట్ల జమ



మిచాంగ్ తుపాను వేళ పంట నష్టాలను అంచనా వేస్తున్న వ్యవసాయ సిబ్బంది

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): మిచాంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన అన్నదాతలకు ప్రభుత్వం ఆపన్న హస్తం అందిస్తోంది. కొండంత అండగా నిలుస్తోంది. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బ తిన్న పంటల లెక్క అప్పట్లోనే తేల్చిన ప్రభుత్వం.. నెలల వ్యవధిలోనే పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించేందుకు సన్నద్ధమైంది. పంటలు నష్టపోయిన రైతుల ఖాతాల్లో ప్రభుత్వ సాయం నేరుగా జమ చేసేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం విజయవాడలో బటన్ నొక్కి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని చెప్పడమే కాదు.. ఆ మాటను అక్షరాలా ఆచరణలో చూపుతూ.. అనుకున్న సమయానికి రైతులకు ప్రతి పథకాన్ని, ప్రయోజనాన్ని అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గం	లబ్ధిదారులు	విస్తీర్ణం (హెక్టార్లు)	నగదు (రూ.కోట్లు)
కాకినాడ రూరల్	1,272	692	1.17
కాకినాడ సిటీ	62	33.2	0.05
పిఠాపురం	5,614	2,466.38	4.11
తుని	7,858	3,181.08	5.40
ప్రత్తిపాడు	4,224	1,835.09	3.11
పెద్దాపురం	1,718	1,193.19	2.02
జగ్గంపేట	4,103	2,049.81	3.47
తాళ్లరేవు (ముమ్మిడివరం)	963	448.21	0.76
పెదపూడి (అనపర్తి)	980	518.04	0.88
కాజులూరు (రామచంద్రపురం)	1,135	540.46	0.91

వేగంగా పంటనష్టం అంచనాలు

గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో వచ్చిన మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలోని పలువురు రైతులు పంట నష్టపోయారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం తుపాను నష్ట నివారణ చర్యలకు వెంటనే ఉపక్రమించింది. తుపాను తెరిపివ్వడం ఆలస్యం.. ప్రభావిత ప్రాంతాలకు చకచకా చేరుకుంది. నిర్దేశిత గడువులోగా నష్టాల అంచనాల ప్రక్రియ పూర్తి చేసింది. ఏ ఒక్క రైతూ నష్టపోకూడదన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నెల రోజుల వ్యవధిలోనే పంట నష్టపోయిన వారి జాబితాను పక్కాగా రూపొందించింది. జాబితాలను గ్రామ/వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచింది. అభ్యంతరాలు స్వీకరించింది. అనంతరం అర్హుల తుది జాబితాకు రూపుదిద్ది ప్రభుత్వానికి పంపింది. ఈ జాబితాను పరిశీలించిన ప్రభుత్వం నెలల వ్యవధిలోనే సాయం విడుదల చేయడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం ఇస్తున్నారిలా..

జిల్లావ్యాప్తంగా 27,980 మంది రైతులకు చెందిన 13,006.07 హెక్టార్లలో వివిధ పంటలకు నష్టం జరిగిందని లెక్క తేల్చారు. నెలలు కూడా తిరగకుండానే నష్ట పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) కింద రూ.21.98 కోట్లు ఆయా రైతుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేయనున్నారు. 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టపోయిన రైతులకు హెక్టారు లెక్కన పరిహారం అందిస్తున్నారు. వరి, వేరుశనగ, పత్తి, చెరకుకు రూ.15 వేల చొప్పున; మొక్కజొన్నకు రూ.12,500; అపరాలు, పొద్దుతిరుగుడు, సోయాచిక్కుడు, గోధుమ, పొగాకు పంటలకు రూ.10 వేల చొప్పున; జొన్న, సజ్జ, రాగి, ఆముదం, నువ్వుల పంటలకు రూ.6,800 చొప్పున నష్టపరిహారం అందజేస్తున్నారు.

బాబు హయాం.. ఎగనామం..

గతంలో చంద్రబాబు హయాంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా 2016, 2018లో రైతులకు రూ.35 కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సిడీ ఎగ్గొట్టారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. పంట నష్టం జరిగిన రెండు మూడు నెలల్లోనే రైతుల ఖాతాల్లో పరిహారం జమ చేసే నూతన ప్రక్రియకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. ఈవిధంగా గత ఐదు సంవత్సరాల్లో 1,39,130 మంది రైతుల ఖాతాల్లో పంట నష్ట పరిహారం కింద రూ.94.95 కోట్ల మేర సాయం అందించారు.



రైతులకు ఎంతో ఉపయోగం



ప్రస్తుతం పంటలు వివిధ దశల్లో ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఈనిక దశలో ఉన్నాయి. ఈ దశలో పెట్టుబడి కోసం రైతులకు నగదు అవసరం. ఈ సమయంలో పంట నష్టపరిహారం అందజేయం వారికి ఎంతో మేలు చేస్తుంది. గతంలో పంట నష్టపరిహారం ఆలస్యమయ్యేది. కానీ ప్రస్తుతం సీజన్ ముగిసిన వెంటనే ప్రభుత్వం ఇస్తోంది. డిసెంబర్‌లో పంట నష్టం జరిగితే మార్చి నెలలోనే వారి ఖాతాల్లో జమ అవుతోంది.

– ఎస్.విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, కాకినాడ

ఓఎన్‌జీసీ పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలి

- మత్స్యకారులకు న్యాయం చేయాలి
- సమస్యను సీఎం దృష్టికి కూడా తీసుకువెళ్లాం
- కలెక్టర్, ఎస్పీలకు ఎంపీ గీత, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ విజ్ఞప్తి



కలెక్టర్ కృతికా శుక్లాకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యేలు కన్నబాబు, ద్వారంపూడి, ఎమ్మెల్సీ పద్మశ్రీ తదితరులు

కాకినాడ: కేజీ బేసిన్‌లో ఓఎన్‌జీసీ కార్యకలాపాల వల్ల ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ ఎంపీ వంగా గీత, సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు కలెక్టర్ కృతికా శుక్లాకు విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకుని వెళ్లామని, ఆయన కూడా సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మత్స్యకార ప్రతినిధులు కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్‌లను మంగళవారం కలిసి, ఈ సమస్యపై చర్చించి, వినతిపత్రాలు అందజేశారు. ఈ నెల 1 నుంచి సముద్రంలో డ్రిల్లింగ్ పనులు చేపట్టాలని ఓఎన్‌జీసీ ప్రతిపాదించడంతో చేపల వేటే జీవనాధారంగా బతికే మత్స్యకారులు ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొందని అన్నారు. సముద్ర గర్భంలో ఓఎన్‌జీసీ చేపట్టే కార్యకలాపాలకు 500 చదరపు కిలో మీటర్ల పరిధిలో వేటపై నిషేధం ఉంటుందని, దీనివలన నష్టపోయే మత్స్యకారులకు పరిహారం ఇవ్వకుండా కార్యకలాపాలు కొనసాగించడం సరికాదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మత్స్యకారుల మనోభావాలను, ఇబ్బందులను గుర్తించి, నిక్షేపాల అన్వేషణకు ఓఎన్‌జీసీ జరుపుతున్న సిస్మిక్ సర్వేను నిలుపు చేశామని, ఆ సంస్థ నుంచి స్పష్టత వచ్చే వరకూ ఆ పనులు కొనసాగించనివ్వబోమని స్పష్టం చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, ఓఎన్‌జీసీ అధికారులతో మాట్లాడి సమస్యను ఓ కొలిక్కి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

మత్స్యకారులకు న్యాయం చేయాలనే..

నష్టపోతున్న మత్స్యకారులకు రాజకీయాలకు అతీతంగా న్యాయం జరగాలనే ఏకైక లక్ష్యంతోనే జెండాలు పక్కన పెట్టి ఉద్యమానికి మద్దతుగా నిలిచామని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి స్పష్టం చేశారు. కలెక్టర్, ఎస్పీలను కలసిన అనంతరం, ఎంపీ గీత, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా మత్స్యకారుల సమస్యను పట్టించుకోకుండా.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ లబ్ధి కోసమే ఉద్యమానికి మద్దతుగా నిలిచామంటూ కొంత మంది టీడీపీ, జనసేన నేతలు చేస్తున్న విమర్శలపై స్పందించారు. సముద్ర గర్భంలో నాలుగైదు రోజుల క్రితమే సిస్మిక్ సర్వే చేపట్టాలని ఓఎన్‌జీసీ నిర్ణయించిన వెంటనే ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టామని స్పష్టం చేశారు. సర్వే సమాచారాన్ని మత్స్యశాఖ గోప్యంగా ఉంచడం వల్ల ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని, తన దృష్టికి వచ్చిన వెంటనే మత్స్యకారులకు అండగా నిలిచి ఉద్యమిస్తున్నామని చెప్పారు. పరిహారం ఇవ్వకుండా సర్వే కొనసాగించే పక్షంలో బోట్లపై వెళ్లి కార్యకలాపాలను అడ్డుకునేందుకు సైతం సిద్ధమని చెప్పారు. ఓఎన్‌జీసీ కన్సల్టేటివ్ కమిటీ సభ్యురాలిగా ఉన్న ఎంపీ వంగా గీత కూడా ఈ అంశంపై ఢిల్లీ వెళ్లి, సంబంధిత వర్గాలతో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమస్యను రాజకీయం చేయవద్దని, మద్దతుగా నిలవాలని కోరారు. ఎవరు కలసి వచ్చినా, రాకపోయినా ఉద్యమం మాత్రం కొనసాగిస్తామని ఎమ్మెల్యే ద్వారంపూడి స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలకు సమాధానం చెబుతానని, ఉద్యమాన్ని మాత్రం నీరుగార్చేలా వ్యవహరించవద్దని సంబంధిత నాయకులకు ఆయన హితవు పలికారు. ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు, సీనియర్ నాయకులు కాటాడి జానకిరామ్, పలువురు బోటు యజమానులు, మత్స్యకార ఐక్య పోరాట సమితి సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

వృద్ధులు, దివ్యాంగులకు హోమ్ ఓటింగ్

- దీంతో పాటు పోస్టల్ బ్యాలెట్‌కూ పక్కా ఏర్పాట్లు
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



కాకినాడ సిటీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్దకు రాలేని వృద్ధులు, దివ్యాంగులు వారి ఇళ్ల వద్దనే ఓటు వేసేందుకు, పోస్టల్ బ్యాలెట్‌కు పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతికా శుక్లా ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బంది, సర్వీస్ ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా.. వృద్ధులు, దివ్యాంగులు హోమ్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అంశంపై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, నోడల్ అధికారులు, వివిధ శాఖల అధికారులకు కలెక్టరేట్‌లో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, 40 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. అలాగే, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణపై ఈఆర్‌ఓలు సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పోలింగ్ సిబ్బందితో పాటు, ఎన్నికల కమిషన్ పాస్ పొందిన పోలింగ్ కవరేజీలో పాల్గొనే మీడియా ప్రతినిధులు కూడా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లో సీనియర్ ఏఆర్‌ఓలను పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారిగా నియమిస్తామని చెప్పారు. నియోజకవర్గాల వారీగా ఎంతమందికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలో ముందుగా జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. తొలి విడత శిక్షణలో పోస్టల్ బ్యాలెట్లు జారీ చేసి, రెండో విడత శిక్షణలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ డి.తిప్పేనాయక్, అదనపు ఎస్పీ జేఎస్‌వీ భాస్కరరావు, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్‌డీఓలు ఇట్ల కిషోర్, జె.సీతారామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భర్త చెంపపై కొట్టడంతో భార్య మృతి

ద్వాక్రా రుణం చెల్లింపు విషయంపై తగాదా

కొవ్వూరు: ద్వాకా రుణ వాయిదా చెల్లింపు విషయంపై తగదా పడి భార్యను భర్త చెంపపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం కొవ్వూరు మండలం మద్దూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సంద్ర వీరబాబు, భార్య లావణ్య సాయి దీపిక(30)తో డ్వాక్రాలో తీసుకున్న రుణం చెల్లింపు విషయంపై వారం నుంచి తగదా పడుతున్నాడు. మంగళవారం ఉదయం వాయిదా డబ్బులు ఇవ్వాలని భార్య మరోసారి అడగడంతో కోపోద్రిక్తుడైన వీరబాబు ఆమెను చెంపపై బలంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే పడి మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం వీరబాబు అత్తమామలకు ఫోన్ చేసి జరిగిన ఘటనకు గురించి తెలిపాడు. వీరబాబుకి, లావణ్యకి 13 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు వీరబాబే లావణ్యను హత్య చేశాడని ఆరోపించారు. పెళ్లి అయినప్పటి నుంచి వీరబాబు తన కుమార్తెను సక్రమంగా చూసుకోలేదని, ఎన్నో బాధలు పెట్టారని తల్లి బడేటి వెంకటలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమార్తెను చిత్ర హింసలకు గురి చేయడమే కాకుండా అన్యాయంగా చంపేశారని ఆరోపించారు. వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. డీఎస్పీ కె.సీ హెచ్ రామరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మాంసం ప్రియులకు 'పండుగ'ప్ప!

- కొమరిపాలెంలో భారీ చేప
- రూ.35 వేలకు విక్రయం



భారీ చేపను చూపుతున్న వ్యాపారులు

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం గ్రామంలోని చేపల మార్కెట్‌కు మంగళవారం సుమారు 150 కిలోల భారీ పండుగప్ప చేప వచ్చింది. దీన్ని మండలంలోని తొస్సిపూడి గ్రామానికి చెందిన వ్యాపారులు పంతాడ విశ్వనాథం, రాజు, విజయ్ కాకినాడ నుంచి తీసుకువచ్చారు. చేపను చూసేందుకు భారీగా ప్రజలు తరలివచ్చారు. మాంసం ప్రియులు కొనుగోలు చేయడానికి ఎగబడ్డారు. అయితే వాటాలుగా 70 మందికి రూ.500 చొప్పున విక్రయించడంతో మొత్తం రూ.35 వేలు వచ్చినట్లు వ్యాపారులు తెలిపారు.

అన్నదాతకు ఇన్ఫర్‌మేషీన్

- రైతులకు అందుబాటులో కియోస్క్‌లు
- తొమ్మిది రకాల సమాచారం ఒకేచోట
- గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు

కాకినాడ సిటీ: అన్నదాత సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. అందులో భాగంగా రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మల్టీ ఫంక్షనల్ కియోస్క్ ద్వారా రైతులు తొమ్మిది రకాలైన సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. ఒక్కో అంశాన్నీ అక్కడక్కడా తెలుసుకునే కంటే గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ ద్వారా సమాచారం సులభంగా తెలుసుకునే వీలు కల్పించారు. వీటి ద్వారా ఏ కాలంలో ఏ పంటలు వేయాలి, కొనుగోలు కేంద్రాలు, పంట నాణ్యతా ప్రమాణాలు, వాతావరణం, మార్కెట్ ధరలు, కనీస మద్దతు ధరలు తదితర అంశాలను రైతులు తెలుసుకొనే వీలు కల్పించారు. వీటిపై రైతులకు పూర్తి అవగాహన కల్పించే చర్యలు వ్యవసాయశాఖ అధికారులు చేపట్టారు.

కొనుగోలు కేంద్రాలు

- గతంలో రైతులు కొనుగోలు కేంద్రాలు ఎక్కడో తెలియక దళారులను ఆశ్రయించేవారు. ఇప్పుడా పరిస్థితి లేకుండా ఆర్బీకేలో ఏర్పాటు చేసిన కియోస్క్ దగ్గరలోని కొనుగోలు కేంద్రాల్లోనే విలువైన సమాచారం అందుతోంది. దీంతో రైతులకు లాభదాయకంగా ఉంటోంది.

నాణ్యతా ప్రమాణాలు

- సీజనల్‌గా రైతులు పండించిన వరి, మొక్కజొన్న, టమాటా, వేరుశనగ, మిరప, కందులు తదితర పంటలకు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలను తెలియజేస్తుంది. ఏ పంటకు ఎంత మేర నాణ్యత ఉంటే గిట్టుబాటు ధర లభిస్తుందనేది ఈ యాప్‌లో పొందుపర్చారు.



అన్నదాతల సేవల కోసం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం

వాతావరణం

- వాతావరణంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంది. ఆర్బీకే పరిధిలో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు, వర్షపాతం వివరాలు తెలుసుకోవచ్చు. దీనికి అనుగుణంగా రైతులు ఏ విధమైన చర్యలు చేపట్టవచ్చో సులభంగా తెలుసుకోవచ్చు.

కనీస మద్దతు ధరలు



ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ మెషీన్

- ఆర్బీకే పరిధిలో ముఖ్య పంటలకు మద్దతు ధరలు తెలుసుకునే వీలుంది. వరి, మొక్కజొన్న, వేరుశనగ, వాణిజ్య పంటలు వేసిన రైతులు నష్టపోకుండా అనుకూలమైన ధరలకు అమ్ముకునేందుకు ఈ యాప్‌ను రూపొందించారు.

ప్రయోగశాలల సమాచారం

- ఆర్బీకే పరిధిలోని రైతులకు డాక్టర్ వైఎస్సార్ సమీకృత వ్యవసాయ ప్రయోగశాలల సమాచారం అందుబాటులో ఉంచారు. దీని ద్వారా ఏ భూమిలో ఏ పంట వేయాలి. దానికి సంబంధించిన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, పశువులకు వచ్చిన రోగాలకు సంబంధించి అన్ని ప్రయోగాలు చేసుకునేందుకు వీలుంది.

ట్యుటోరియల్

- కియోస్క్‌లో పొందుపరిచిన యాప్ ద్వారా అన్ని రకాల పంటలు సాగు చేసే విధానానికి సంబంధించిన వీడియోలు ప్రదర్శిస్తారు. ఆర్బీకే చానల్ ప్రోగ్రామ్స్ చూపించడం, సమగ్ర సస్యరక్షణ, పంట యాజమాన్యం తదితరాలను వీడియో రూపంలో చూపించి రైతులకు అవగాహన కల్పిస్తారు.

రైతు సమాచారం

- రైతులకు సంబంధించి వ్యవసాయ వార్తలను కియోస్క్ ద్వారా తెలుసుకోవచ్చు. వైఎస్సార్ రైతు భరోసా, సాగుకు భరోసా, ప్రకృతి వ్యవసాయం చేసే విధానం, మూగ జీవాలకు అంబులెన్స్, ఆర్బీకేల ద్వారా పంటల కొనుగోలు వంటి వార్తా సంబంధిత విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

మార్కెట్ ధరలు

- మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న ధరలను ఒక్కొక్కరు ఒక్కోలా చెప్పడంతో దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి పలికి ఆర్బీకేకు దగ్గర్లోని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పంటల తేమ శాతం ఆధారంగా రైతు విక్రయించుకునే సమయంలో ఉన్న కనిష్ఠ, గరిష్ఠ, మార్కెట్ ధరలను తెలుసుకోవచ్చు.

అనుబంధ యాప్

- కియోస్క్‌లో పొందుపర్చిన అనుబంధ యాప్‌లో మరో ఐదు అంశాలను చేర్చారు. ఆర్బీకే అమ్మకాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాల వివరాలు తెలుసుకోవచ్చు. ప్రభుత్వం అమలు చేస్తున్న పనిముట్లు, పశుసంవర్ధక, మత్స్య సంపద ఉత్పత్తులు, సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల వివరాలు, కస్టమ్ హైరింగ్ కేంద్రాలు, ఇతర సౌకర్యాలు తెలుసుకునే వీలుంది.

వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ప్రారంభం:	2020
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కేంద్రాలు:	1,129
కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసిన కేంద్రాలు :	978
సేవలు పొందుతున్న రైతులు :	4,55,022 మంది
ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సాయం:	రూ. 415.55 కోట్లు
ఆర్బీకేలో పరిధిలో ఏర్పాటు చేసిన రాజన్న పశువైద్య కేంద్రాలు:	1,129

రైతులకు ప్రయోజనం



ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌ల ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చే యాప్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ల ద్వారా తొమ్మిది రకాల ప్రయోజనాలు చేకూరనున్నాయి. వీటిని సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికాభివృద్ధి చెందవచ్చు.

– ఎస్ విజయకుమార్, జిల్లా వ్యవసాయశాఖాధికారి, కాకినాడ జిల్లా

నిజాయితీకి నిలువుటద్దం చిట్టిబ్బాయి

విగ్రహావిష్కరణ సభలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి

అమలాపురం టౌన్: నీతి నిజాయితీకి నిలువుటద్దంలా రాజకీయాలను నడిపిన కుడుపూడి చిట్టబ్బాయి జిల్లా చరిత్రలో నిలిచిపోతారని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి అన్నారు. అమలాపురం గడియారం స్తంభం సెంటర్ సమీపంలో నిర్మించిన చిట్టబ్బాయి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని మిథున్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అధ్యక్షతన సభలో మిథున్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ఆర్ అండ్ బీ మంత్రి దాడిశెట్టి రాజా మరో అతిథిగా ప్రసంగించారు. మిథున్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని కులాలను ఏకతాటిపై నడిపించి అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన చిట్టబ్బాయి విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టమన్నారు. చిట్టబ్బాయి కుటుంబానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని స్పష్టం చేశారు. దివంగత చిట్టబ్బాయి కుమారుడు భరత్ భూషన్‌కు ప్రభుత్వం, పార్టీ పరంగా భవిష్యత్‌లో మంచి రోజులు ఉంటాయని చెప్పారు. అమలాపురంలో శెట్టిబలిజ కమ్యూనిటీ హాలు నిర్మాణం విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో ఉంచి ఆమోద్ర ముద్ర వేస్తామన్నారు. మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ అమలాపురం ఎమ్మెల్యేగా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేతగా చిట్టబ్బాయి విలువలతో కూడిన రాజకీయాన్ని నిర్వహించారని గుర్తు చేశారు. రాజకీయం కోసం తన నీతి నిజాయితీతో ఏమీ సంపాదించుకోకుండా తన ఆస్తిని హారతి కర్పూరంలా హరింప చేశారన్నారు. నేడు ఆయన కుటుంబం సాధారణంగా జీవిస్తోందని మంత్రి విశ్వరూప్ అన్నారు. మంత్రి రాజా మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చిట్టబ్బాయి ఓ బలమైన ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ముఖ్యంగా బీసీ కులాల ఉద్యమాలు, పోరాటాల్లో చిట్టబ్బాయి చురుకైన పాత్ర పోషిస్తూనే అన్ని కులాల మనిషిగా ఎదిగారని గుర్తు చేశారు. ఓ జాతి రత్నాన్ని కోల్పోయామంటూ భావోద్వేగానికి గురైన బోస్ సభాముఖంగా విలపించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ నేను రాజకీయాల్లోకి రావడానికి చిట్టబ్బాయే కారణమని, ఆయన ఆశీస్సులతోనే నేను ఈ రోజు రాజకీయంగా ఈ స్థాయిలో ఉన్నానని చెప్పారు. ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం, రాజమహేంద్రవరం ఎంపీలు చింతా అనురాధ, మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, రాష్ట్ర కాపు రిజర్వేషన్ సమితి అధ్యక్షుడు నల్లా విష్ణుమూర్తి, చిట్టబ్బాయి కుమారుడు కుడుపూడి భరత్ భూషణ్ సభలో మాట్లాడి చిట్టబ్బాయి వ్యక్తిత్వాన్ని కొనియాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ విప్పర్తి వేణుగోపాల్, రాష్ట్ర దృశ్య కళల అకాడమి చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, స్టేట్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, రాష్ట్ర సైన్స్ టెక్నాలజీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ పితాని ప్రభావతి, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి మునికుమారి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని పాల్గొన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం నేతలు చిట్టబ్బాయి ఇంటికి వెళ్లి కొద్ది సేపు ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఎల్లప్పుడూ మేమంతా అండగా ఉంటామని మరోసారి భరోసా ఇచ్చారు. చిట్టబ్బాయి భార్య అరుణ, ఆమె కుమారులు, కోడళ్లు, కుమార్తెతో వారు మాట్లాడారు. తొలుత స్థానిక హైస్కూలు సెంటరులోని మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మిథున్‌రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కడ నుంచి పాదయాత్రగా, ఊరేగింపుతో చిట్టబ్బాయి విగ్రహం వద్దకు చేరుకుని ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



చిట్టబ్బాయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, మంత్రులు విశ్వరూప్, రాజా, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

7న పరిశ్రమల్లో విపత్తుల నియంత్రణపై మాక్ ఎక్సర్‌సైజ్

కాకినాడ సిటీ: పరిశ్రమల్లో రసాయనిక ప్రమాదాలు ఎదురైనప్పుడు విపత్తు నియంత్రణలో తక్షణ స్పందన సంసిద్ధతలను యంత్రాంగంలో పెంపొందించేందుకు ఈ నెల 7వ తేదీన మాక్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.రాధాకృష్ణ మంగళవారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర విపత్తు నియంత్రణ సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆరోజు ఉదయం 8.30 గంటలకు కాకినాడ రూరల్ మండలం, తమ్మవరం గ్రామంలోని ఎస్‌సీఎస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మోటార్ స్పిరిట్ ఓవర్ ఫ్లో విపత్తు నియంత్రణ, మధ్యాహ్నం 11 గంటలకు సామర్లకోట మండలం పనసపాడులో గల దేవీ ఫిషరీస్ లిమిటెడ్ పరిశ్రమలో అమ్మోనియా వాయువు లీకేజీ విపత్తు నియంత్రణ అంశాలపై ఈ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు ముందస్తు టేబుల్ టాప్ ఎక్సర్ సైజ్ ప్రక్రియను మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారన్నారు. మాక్ ఎక్సర్‌సైజ్ కలెక్టర్ కృతికా శుక్లా పర్యవేక్షణలో కాకినాడ ఆర్డీవో ఇ.కిషోర్ ఇన్సిడెంట్ కమాండర్‌గా వ్యవహరిస్తారన్నారు. ఫైర్, పోలీస్, రవాణా, వైద్య ఆరోగ్య, కాలుష్య నియంత్రణ మండలి, సమాచార శాఖలు భాగస్వామ్యం వహిస్తాయన్నారు.

అనువులు తీసిన అతి వేగం

- బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరి మృతి
- పల్లంకుర్రులో రెండు కుటుంబాలలో విషాదం



మట్టా ఏడుకొండలు




కన్నీడి లక్ష్మణరావు

కాట్రేనికోన: అతి వేగం అతి విలువైన ప్రాణాలను బలిగొంది. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపిన ఆ యువకుడు తాను మృత్యువాత పడడమే కాక, మరొకరిని బలిగొని రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపాడు. పల్లంకుర్రు– బలుసుతిప్ప రోడ్డులో వడ్డివారిపేట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం ఇద్దరిని బలిగొంది. వివరాలిలా ఉన్నాయి. ఐ చెరువుకు చెందిన మట్టా ఏడుకొండలు, ఉదయశ్రీ దంపతులు సాయంత్రం పల్లంకుర్రు నుంచి తమ ఇంటికి బైక్‌పై బయలుదేరారు. వడ్డివారిపేట వద్ద కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ సాపేవారిపేటకు చెందిన కన్నీడి లక్ష్మణరావు అతని స్నేహితుడితో బైక్‌పై వచ్చి వీరిని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. లక్ష్మణరావు (20) అక్కడికక్కడే మృతి చెందగా, మట్టా ఏడు కొండలు (50) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏడుకొండలు భార్య ఉదయశ్రీ, లక్ష్మణరావు స్నేహితుడు గాయపడ్డారు. వారి పరిస్థితి ఆందోళన కరంగా ఉందని వైద్యులు తెలిపారు. పీఎంపీ వైద్యుడైన ఏడుకొండలుకు పెళ్లైన ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి ఉన్నారు. ఈ ప్రమాదంతో పల్లంకుర్రులో రెండు కుటుంబాలలో విషాదం అలుముకుంది. యువకుడు అతి వేగంగా వాహనం నడపటం రెండు కుటుంబాల్లో విషాదం నింపిందని స్థానికులు అంటున్నారు. స్థానిక సర్పంచ్ నాతి ఆలివేణి, సత్యనారాయణల సంతాపం తెలిపారు. ఆసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టమ్ నిర్వహించామని, ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని కాట్రేనికోన ఎస్సై బి.నాగేశ్వరరావు తెలిపారు.

25 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

రూ.21.5 లక్షల విలువైన సరకు, లారీ సీజ్



సీజ్ చేసిన లారీ వద్ద విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి తదితరులు

ఆలమూరు: అక్రమంగా తరలిస్తున్న 25 టన్నుల రేషన్ బియ్యాన్ని రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. కృష్ణాజిల్లా పామర్రు లోని శ్రీగౌతమ్ రైస్ అండ్ ఆగ్రో ఎక్స్‌పోర్టు నుంచి కాకినాడ వెళుతున్న లారీని సీఐ టి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అధికారుల బృందం జొన్నాడ వద్ద తనిఖీ చేసి పట్టుకున్నారు. లారీలో ఉన్న 500 బస్తాల రేషన్ బియ్యాన్ని, లారీని సీజ్ చేశారు. డ్రైవర్ పి.రాజేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రేషన్ బియ్యం తరలింపునకు పాల్పడినట్లు భావిస్తున్న జి.రమేష్‌బాబును అదుపులోకి తీసుకుంటామని సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ బియ్యాన్ని ఎంఎస్‌ఓ ఎస్‌కే ఆలీషాకు, లారీని ఆలమూరు పోలీసులకు అప్పగించారు. సీజ్ చేసిన బియ్యాన్ని ఎంఎస్‌ఓ ఎస్‌కే ఆలీషా మండపేట ప్రభుత్వ గోదాముకు తరలించారు. ఈ మేరకు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేస్తున్న బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. ఏఓ భార్గవ్ మహేష్, సిబ్బంది లోవరాజు, కిషోర్, వీర్రాజు పాల్గొన్నారు.

ముగ్గురికి దేహశుద్ధి

పిఠాపురం: స్థానిక కుంతీ మాధవస్వామి ఆలయ సమీపంలో మంగళవారం చోరీకి ప్రయత్నిస్తున్న ముగ్గురిని అక్కడి వారు పట్టుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం ఆ ముగ్గురూ ఇంట్లో ఎవరు లేరని చూసి కాగితాలు ఏరే వారిగా వచ్చి చోరీకి ప్రయత్నించారు. అనుమానాస్పదంగా ఇంట్లోకి వెళ్లడం చూసిన స్థానికులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చోరీకి ప్రయత్నించిన నిందితులు

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు

దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లాలోని రెండు వేలం కేంద్రాలు, ఏలూరు జిల్లాలోని మూడు వేలం కేంద్రాల్లో 2023–24లో పండించిన ఎన్ఎల్ఎస్ పొగాకు కొనుగోళ్లు బుధవారం నుంచి ప్రారంభిస్తున్నారు. దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లకు అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవరపల్లి వేలం కేంద్రంలో ఉదయం 10 గంటలకు రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖా మంత్రి తానేటి వనిత కొనుగోళ్లు ప్రారంభిస్తారని వేలం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. పొగాకు విక్రయాలకు రైతులు సన్నద్ధమవుతున్నారు. గత ఏడాది కంటే 20 రోజుల ముందుగా ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లు ప్రారంభిస్తున్నారు. దీనివల్ల రైతులకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది.

కారు దగ్ధం

పిఠాపురం: స్థానిక పప్పుల వీధి రామకోవెల సమీపంలో మంగళవారం ఒక కారు అనుమానాస్పద స్థితిలో అగ్నికి ఆహుతి అయ్యింది. స్థానికుల కథనం ప్రకారం మంగళవారం ఉదయం పప్పుల వీధి రామకోవెల సమీపంలో పార్కింగ్ చేసిన ఒక కారులో మంటలు రావడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో పిఠాపురం అగ్నిమాపకాధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. పిఠాపురం పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మతిస్థిమితం లేని వ్యక్తి కారుకు నిప్పంటించినట్లు అనుమానిస్తున్నారు.



దగ్ధమైన కారు

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

తుని: ఇంటి నుంచి పారిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగించినట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ మంగళవారం తెలిపారు. రైల్వే పోలీసులు కథనం ప్రకారం..

విశాఖపట్నం మర్రిపాలెంకు చెందిన ముప్పిడి గగనదీపిక విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ గరీభ్ రథ్ రైలులో వెళుతుండగా ఉన్నతాధికారుల నుంచి అందిన సమాచారంతో తునిలో రైల్వే హెచ్‌సీ పితాని శ్రీనివాస్, వుమెన్ కానిస్టేబుల్ మంగ, కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, రోనికేశ్వరరావు, రాము గాలించి బాలికను పట్టుకున్నారు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్లో కిడ్నాప్ కేసుగా నమోదు కావడంతో ఎయిర్‌పోర్ట్ పోలీసుల సమక్షంలో బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.



తునిలో బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు